భేదం

రెండు సంవత్సరాలకు మళ్ళీ పాత స్నేహితుడు నారాయణను చూసేందుకు వాళ్ళ ఊరు వెళ్లాను. కిందటిసారికీ ఇప్పటికీ అనేక మార్పులు జరిగినయ్. డాబా కట్టటం పూర్తయింది. చిన్నదయినా ఎంతో ఆకర్షణీయంగా వుంది. పెద్దదొడ్డి, దొడ్డినిండా పూలచెట్లు, డాబా ముందరిభాగంలో పందిరి.

మేమిద్దరమూ స్నేహితులమే ఐనా ఆత్మ బంధువులకన్నా సన్నిహితంగా ఉంటాం. వాళ్ళందరూ నన్ను కుటుంబంలోని వ్యక్తినన్నట్టే చూస్తారు. నారాయణ చాలా తృప్తికరమైన జీవితాన్ని గడుపుతున్నాడనేది ఎవరికైనా తేలిగ్గా అర్థమౌతుంది.

అన్నిటికన్నా నన్ను కలతపెట్టిన మార్పు — ఆ తెల్ల మచ్చలున్న నల్లకుక్క. వాళ్ళందరూ దాన్ని ఎంతో ప్రేమతో చూస్తారు. నారాయణ కొడుకూ, కూతురూ దాంతో ఆడుకుంటూరు. వాళ్లు చిన్నపిల్లలు కనుక, వాళ్లుచేసే పనిలోని మంచిచెడ్డల్ని విమర్శించటం న్యాయంకాదు. కాని, నారాయణ, వాడిభార్య వాడి తల్లీకూడా — అది జంతువేకాదన్నట్టూ, అదికూడా ఒక మనిషేనన్నట్టూ దాన్ని అతి గౌరవంగా చూడటంమాత్రం నన్ను కలతపెట్టింది. ఒకమూల దానికొక గడ్డిపరుపు, తాగేందుకు పింగాణీ బొచ్చెలో నీళ్ళు ఎప్పుడూ సిద్ధంగాఉంటాయ్. ఇంకో పింగాణీ కంచంలో వేళకు తిండిపడుతూవుంటుంది. ప్రత్యేకంగా దానికోగది లేక

పోయినా, అదినివసించే కాస్తమేరా గదికన్న ఎక్కువగనే వుంది. రెండుపూటలా ఆనేలను శుభ్రంచేయటమూ, దాని పాత్ర సామగ్రి కడగటమూ ఉదయాన కార్బాలిక్ సబ్బు పెట్టి వేడి నీళ్లతో దాన్ని స్నానంచేయించటమూ ఇదంతా జీతగాడిపని. దానికి తోచనప్పుడల్లా ఇంటి ఆవరణను చుట్టి వొస్తూ వుంటుంది. కొత్తవ్యక్తి ఎవర్నన్నా చూసిందంటే అరవటం ప్రారంభిస్తుంది. యజమానులు 'మనవాడేలే' అని చెప్పేదాకాఆగదు. ఆ చెప్పటం ఆలస్యమైతే భయంకరంగా చూస్తూదాడాదాపు కరవొచ్చేటంత పనిచేస్తుంది. నారాయణ, ఆ కుటుంబీకులు ఎవరో ఒకరు బైటికి వొచ్చేదాకా ఆగక పోతేమాత్రం అది కరుస్తుంది కూడాను.

ఆ ఇంట్లోని వ్యక్తుల విషయంలో దానికెంతో అభిమానం. ఒక్కోవ్యక్తి కాళ్లకూ, వేళ్ళకూ చుట్టుకుంటుంది. మంచిమాటల్తో దాన్నిమెల్లిగా వొదిలించుకునేందుకు వాళ్ళు ప్రయత్నిస్తారు. ఎప్పుడన్నా విసుగ్గావుండి కసురుతే కిక్కురు మనకుండా మొహంవేళ్ళాడవేసి, తోక వెనకాళ్లలోకి ముడుచుకొని మూలజేరి దీనంగా, జాలిగా, బాధగా చూస్తుంది. ఆ విసుక్కున్న వ్యక్తివచ్చి దాన్నిబుజ్జగిస్తూ క్షమార్పణలు అర్పించేదాకా దానిఅవస్థ అంతే! పిల్లలు ఏదన్నా చిరుతిండితింటూంటే వాళ్ళకు దూరంగా కూర్చుంటుంది. పిల్లలుకూడా, దాన్ని ఎక్కువగా ఊరించి ఏడిపించకుండా వెంటనే దానిభాగాన్ని ముట్టజెప్పి ఆనందిస్తూ ఉంటారు. దాని స్వేచ్ఛకు ఏమీ ఆటంకంలేదు; మెడకు గొలుసుకూడా లేదు!

వొచ్చినప్పటినుంచీ నాకన్ను దాని మీదనే వుంది. నాకు అసలే కుక్కలంటే మహాచీదర, అందులోనూ ఇది బొచ్చుకుక్క. కనీసం తెల్లకుక్కన్నా కాదు. నాటురకంబజారు కుక్క. దీన్ని 'జానీ. జానీ!' అంటూ దువ్వుతూ ప్రేమగా చూస్తుంటే నాకు చాలా బాధ కలిగింది. కాని ఆసంగతి బైట పెట్టడం—నా బాధను భాగాలుగా తలాకాస్త పంచి ఇవ్వటం అవుతుందని సందేహించి ఊరుకున్నాను.

మనకు ఇష్టమైన వ్యక్తినిగూర్చి పరిచయం చేసుకోవాలనే కుతూహలం ఎలా కలుగుతుందో, అలాగే మనకు అయిష్టమైన వ్యక్తినిగూర్చి తెలుసుకోవాలనే కుతూహలం కలగటంలో ఆశ్చర్యమేమీలేదు. దాని బాధను వాళ్ళ బాధగా చూసుకుంటూ రాత్రిళ్లు భోజనమూ ప్లస్ పాలూ కూడా పోస్తూ—క్షణక్షణానికి దాని క్షేమాన్ని విచారిస్తూ దానికింతగా సేవలు చేస్తూంటే, ఆ విశేషమేదో. తెలుసుకోక పోవటం నాకు మరీ బాధాకరమైన విషయంగా తోచింది.

రాత్రి భోంచేసి తీరిగ్గా పందిట్లో పడుకున్నాక మెల్లిగా యీ విషయాన్ని కదలేశాను.

"నా కిక్కడ అంతా బాగానే వుంది కాని, యీ పాడు కుక్కేమిటీ?"

నారాయణనవ్వి "అది నిన్నేం చేసిందీ?" అన్నాడు.

"నా కేం హానిచేసిందని కాదు. దాన్ని ఇంత ప్రేమగా చూస్తున్నావంటే నాకు ఆశ్చర్యంగా వుంది"

"దానికో కథ వుంది. నువ్వు ఓపిగ్గావింటే చెప్తాను."

కుక్క అంటేనే చీదరించుకునే నాకు దాని కథను వినటంకన్నా తలనొప్పి వ్యవహారం ఉండదు. కాని తీరా ఇంతదూరం వొచ్చాక 'వెధవకుక్క— దానికోకథనా ?' అనటం చాలా కటువుగా తోచింది. ఇష్టం లేకపోయినా 'సరే కానీ—' అనక తప్పలేదు.

నారాయణ చెప్పటం మొదలు పెట్టాడు !

*　　*　　*　　*

సరిగ్గా సంవత్సరం క్రితం—ఒక అమావాస్య రాత్రి. కుంభవర్షం కుమ్మరిస్తోంది. ఉరుములూ, మెరుపులూ భయంకరంగా ఉన్నయ్. పెనుగాలికి పెద్దపెద్ద చెట్లే విరిగి పడుతున్నయ్.

బాగా తడిసిపోయి ఎలాగో ఎనిమిదింటికి నేను ఇల్లు చేరాను. అరుగు మూలలో మూలుగు వినిపించింది. మెరుపు కాంతిలో ఒకవ్యక్తి కూర్చున్నట్టుకూడా గ్రహించాను.

"ఎవరూ ?" అన్నాను.

"బాటసారిని బాబూ ! వానకు ఆగలేక ఇక్కడ కూర్చున్నాను" అన్నాడు.

మాట తీరునుబట్టి సంస్కారం ఉన్న వ్యక్తిగానే తోచింది. లాంతరు తెప్పించి చూశాను. బాగా తడిసిపోయి ఉన్నాడు. జలుబు చేసినట్టుకూడా కంఠస్వరం చెప్తోంది. చలికి ఒణికిపోతున్నాడు.

"ఎక్కడికిపోవాలి?" అన్నాను.

పక్క గ్రామంపేరు చెప్పాడు.

"యీరాత్రి ఎట్లా వెళ్తావూ?" అని అడిగాను.

"మీరు అనుమతిస్తే ఇక్కడే ఉండి వానతగ్గగానే వెళ్ళిపోతాను" అన్నాడు.

ఆ వ్యక్తిమీద నాకు జాలి కలిగింది. అందులోనూ అతనిలాగే వానలో బాగా తడిసి వచ్చిన నాకు అతని బాధలో కొంతభాగం బాగా అర్థమైంది. ఒక్క రాత్రికి ఒక పాంథుడికి ఎందుకు సహాయం చేయకూడదూ? అతడు ఎవరైనా —తోటిమానవుడు

"భోంచేశారా?"

"లేదు."

అతని పరిస్థితి ఏమీ బాగున్నట్లుతోచలేదు. అప్పటికి యీపందిరింకా పడకపోవటంవల్ల అరుగంతా తడిసిపోయింది. పెద్దవానకు తోడుగా పెనుగాలికూడా ఉండటంవల్ల వానంతా అరుగుమీదనేవుంది. ఊరికి మొదటిల్లు మాదేకావటంవల్ల తలదాచుకుందామని వొచ్చివుంటాడు. మనిషిమీద మంచి అభిప్రాయం కలగాలే కాని, ఎంతో జాలి దానంతట అదే పుట్టుకొచ్చి ఎంత సహాయమైనా చెయ్యబుద్ధిపుడుతుంది. చేస్తాంకూడాను.

తుండుగుడ్డయిచ్చి వొళ్ళంతా తుడుచుకోమన్నాను. తడిగుడ్డలు తీయించి, పొడిగుడ్డలిచ్చాను. చలితో వొళ్ళు

కొంకర్లుపోయి బిగుసుకుపోయి ఉన్నాడు. కుంపటిదగ్గర చలి కాచుకున్నాక కాని, మామూలు మనిషవలేదు.

"జ్వరం వొస్తున్నట్టుగా వుంది" అన్నాడు.

డాక్టర్నవటంవల్ల పరిశీలించాను. జ్వరమొచ్చే చిహ్నాలేమీ లేవు కాని, బాగా అలసిపోవటంవల్ల శక్తికిమించిన పనిచేయటంవల్ల అతని అవయవాలన్నీ మూలుగు తున్నయ్. అతనికి కావాల్సిందల్లా కడుపునిండా భోజనం. ఆతరువాత నిద్ర దానంతట అదే బైటి తుఫానల్లే వొచ్చిపడుతుంది. ఆనిద్రలో అవయవాలు కావల్సిన విశ్రాంతిని తీసుకొంటే తెల్లారేప్పటికి ఏమీ ఉండదు.

నాతోపాటే భోజనం చేశాడు. ఆకలితో ఎంతగానో బాధపడుతున్నవాడల్లే— అన్నానికి మొహం వాచినవ్యక్తిలాగు—త్వరత్వరగా నోటినిండా నవిలేందుకూడా సందు వొదలనంతగా కూరుకున్నాడు. ఇదిచూస్తే ఎంత పాత్రమైన దానం చేశానో ననిపించింది.

అప్పటికి అరగంటనుంచీ బైటిఅరుగు మీదనుంచి సన్నని మూలుగు వినిపిస్తోంది. బాధతోచావసిద్ధమైన జంతువేదో చావలేక చావలేక చేసేశబ్దమది. లాంతరు తీసుకొచ్చి చూస్తే యీకుక్క ముడుచుకొని మూలుగుతూ పడివుంది. ఇంతకు ముందుకూడా దీన్నిచూసిన జ్ఞాపకంవుంది కాని, అంతగా గమనించలేదు.

"యీ కుక్క మీదేనా ?" అని అడిగాను.

"కాదు మధ్యాహ్నము కాఫీ హోటల్లో ఫలహారం తీసుకుంటూంటే నా కాళ్ళ చుట్టూ తారట్లాడింది. కాస్త దానికి కూడా వేశాను. ఎనిమిది మైళ్ళనుంచీ నన్ను వెంటాడుతోంది. రెండుమూడుసార్లు వొదిలించుకోవాలని చూశాను కాని వొదిలేట్టు కనిపించలేదు. వెధవ బజారుకుక్క !" అన్నాడు.

కాస్త ఎంగిలి ఫలహారానికే ఎనిమిదిమైళ్ళు వెంట పడ్డకుక్క అనేప్పటికి నాకు జాలి కలిగింది. దీన్ని ఏం చేద్దామా అనే ఆలోచన తెగకముందే మాపిల్ల లిద్దరూ దాంతో ఆడుకోసాగారు. దీనిని వెంటనే వెళ్లగొట్టి పిల్లల ఆనందాన్ని పాడుచేయ బుద్ధిపుట్టలేదు. వెళ్ళగొట్టకపోతే తెల్లవార్లూ ఇలాగే మూలుగుతూ నిద్రాభంగం చేస్తూ వుంటుంది. దీనికూడా ఇంత అన్నం పారేస్తే తిని ఒక మూల పడివుంటుంది. కాకపోతే తెల్లారాక తరిమేయవచ్చు — అనుకున్నాను.

అన్నం చూసేప్పటికి అది వొళ్ళు విరుచుకుని తోక ఝాడించి పాంథుడికన్న ఆతురతతో తిన్నది. తిని కృతజ్ఞతా పూర్వకంగా ముందుకాళ్ళమీద వొంగి నమస్కరిస్తున్నట్టు తల వొంచింది. నా జాలి ఇంకో మెట్టు పైకి పాకింది.

యీ వానలో బైట పడుకుంటే తెల్లారేప్పటికి చస్తుందేమో అని ఇంట్లోనే ఒకమూల పాతగోనె పట్టా వేసి దానిమీద పడుకోబెట్టాను. పిల్లలతో కాసేపు ఆడి, పిల్లలు నిద్ర పోగానే అదికూడా కిక్కురు మనకుండా పడుకుంది.

మా అతిథి అందరికన్నా ముందుగానే నిద్రాదేవిని ఆరాధించసాగాడు. నాక్కూడా నిద్రపట్టింది.

ఒకరాత్రివేళ కుక్క మొరగటం ప్రారంభించింది. మంచినిద్ర చెడగానే యీ వెధవ కుక్కల్ని జేరదియ్యటం బుద్ధి తక్కువని పించింది. బాగా బద్ధకంగావుండి, కళ్ళుకూడా తెరవకుండానే 'ఛప్!' అని గట్టిగా గదమాయించేప్పటికి అది మొరగటం మాని కాసేపు మూలిగి, ఇంకోసారి దబాయించేప్పటికి నిశ్శబ్దంగా ఊరుకుంది.

తెల్లారేప్పటికి గాలివాన తగ్గిపోయింది. సన్నని తుపర మాత్రం పడుతూవుంది. రాత్రి అతిథి కనిపించలేదు. బైటికి వెళ్ళాడేమో ననుకున్నాం.

పది గంటలైనా అంతులేకపోవటంవల్ల చెప్పకుండా వెళ్ళిఉంటాడనేది రూఢిగా తెలుసుకున్నాను. అతనితోపాటే నగలపెట్టెకూడా మాయమైందని కనుక్కోనేందుకు ఎక్కువ సేపు పట్టలేదు. రాత్రి వాడిమొహమన్నా సరిగ్గాచూడలేదు.

వాడిమీాద నాకు కలిగిన జాలి వాడివివరాలేమీా ప్రశ్నించే అవసరం లేకుండా చేసింది. వాణ్ని పట్టుకునే విషయంలో నాకేవిధమైన ఆశలూలేవు.

పోతే యీ కుక్కమాత్రం మొహం దీనంగా పెట్టి, నావెంట తిరుగుతూనే వుంది. రాత్రి ఇదిమొరిగిన వేళలో వాడు దారిపట్టి ఉంటాడు. ఇద్దరికీ పెట్టిన ఒకేభోజనం—ఒక కృతఘ్నతనూ, ఒక కృతజ్ఞతనూ ప్రదర్శించింది. మనిషికన్న కుక్క ఎంత విశ్వాసమైన జంతువో తేలిగ్గా అర్థమైంది.

ఆనాటినుంచీ యీకుక్కను జాగ్రత్తగా పెంచుతున్నాం. మేం తినగా మిగిలింది తింటూ ఒకవేళ మిగలకపోతే ఆ ఎంగిలాకులన్నీ నాకుతూ సరిపెట్టుకుంటుంది. రాత్రిళ్ళు ఇంటి చుట్టూ గస్తీ తిరుగుతూ వుంటుంది. అది మొరిగిందంటే నేనులేచి దాని ఆజ్ఞను శిరసావహించాల్సిందే! అలా రెండు సార్లు దొంగలనుంచి కాపాడింది. నాటికీ మా అందరికీ యీ కుక్కమీది అభిమానం వృద్ధవుతూనేవుంది.

అది కఠినపు మాటల్తో మనను నొప్పించదు. ఎప్పుడన్నా మనం విసుక్కుంటే గ్రహించి, మనను వేధించకుండా ఒకమూల విచారంగా కూర్చుంటుంది. మభ్యపెట్టి మోసపుచ్చటమూ, తిన్నయింటివాసాలే లెక్కించటమూ దానికిచేతకాదు. పిల్లల్తో ఆడుకుంటూంటుంది. ఒకరికి అనవసరంగా హానిచెయ్యదు. మానవసమాజం కోరతగ్గది ఇంతకన్న ఇంకేం వుంటుందీ? విషపుజంతువుల జోలికి మనం పోము; ఎందుకంటే—అవ్వి విషపుజంతువులని మనకు తెలుసు. కాని మనుషుల్లో ఉండే విషాన్ని మనంకనుక్కోలేం. అందుకనే వాళ్ళ కాటుపడకుండా తప్పించుకు తిరగటం చాలా కష్టం.

ఇప్పుడది కడుపుతో ఉన్నది. నాలుగైదు నెలల్లో సంతానాన్ని కంటుంది. అదీ దాని కుటుంబమూ ఇక్కడే ఉండి మాకు సేవచేసుకుంటూ హాయిగా కాలాన్ని గడుపుతుంది: దాని పిల్లలకు ఈ కథంతా చెప్పి విశ్వాసాన్ని నూరిపోస్తుంది—వాడు—ఆ దొంగవెధవకూడా సంతానానికి

తండ్రి అవొచ్చు. కాని వాడి సంతానానికి వాడు ఇలాంటి దొంగ బుద్ధుల్నే నూరిపోస్తాడు. మరికొంతమంది దొంగలు తయారౌతారు. మనిషికీ కుక్కకూ ఇదే భేదం!"

* * * *

నారాయణ కథ విన్నాక, ఆ కుక్కమీద నాక్కూడా ఒకవిధమైన గౌరవభావం కలిగింది.

ఫిబ్రవరి, 1947.